క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



శాయంపేట : మండలంలోని ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రశంసాపత్రాలు అందుకున్న పలువురిని హనుమకొండ పట్టణంలో ట్రస్మా, వడుప్సా ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ ఏ అమృతరావు ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కాట్రపల్లి సీఎస్ఐ పాఠశాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడు అనిల్‌కుమార్, రాజన్న, శాయంపేట వివేకానంద పాఠశాల నుంచి కుమార్, వేద పాఠశాల నుంచి విజయ్, వేద ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రశంసాపత్రం, మెమొంటోను అందుకోగా వారిని తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : వెంకటాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఏఈ సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకటాపురం సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం, వనమాల కనపర్తి, రఘునాథపల్లి, మల్లక్‌పల్లి(గుంటూర్‌పల్లి) గ్రామాలతో పాటు వ్యవసాయ విద్యుత్‌కు మధ్యాహ్నం 1 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామస్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'వైద్యం పేరుతో వ్యాపారం'

హన్మకొండ అర్బన్: వైద్యం పేరుతో వ్యాపారం చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ డిమాండ్ చేశారు. 49వ డివిజన్‌లోని ప్రగతినగర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ నగరంలో పలు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమానులు వైద్యాన్ని వ్యాపారంగా మార్చుకొని రోగులను దోచుకుంటున్నారని వివరించారు. వైద్య వ్యాపారం కోసం ప్రత్యేకంగా పీఆర్‌ఓలను ఏర్పాటు చేసుకొని రోగులను తీసుకువచ్చే ఆర్ఎంపీ, పీఎంపీలకు 25 నుంచి 35 శాతం కమిషన్‌లు ఇస్తూ దందా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జ్వరం వచ్చి ఆస్పత్రికి వెళ్తే అవసరం లేకున్నా రక్త పరీక్షలు, స్కానింగ్ తీయిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో శివరాత్రి కర్ణాకర్, రచపుడి యువన్, అరవింద్, అనిల్ పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ శాంతినగర్‌లోని శాకరాశికుంట కట్టపై గ్రామ దేవత భూలక్ష్మి, శ్రీలక్ష్మి బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో సోమవారం ఉదయం జరిగాయి. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముస్కమల్ల సుధాకర్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ, సభ్యుల సహకారం, వేద పండితుడు భాస్కరాచార్యులు, రుత్వికుల నేతృత్వంలో గ్రామ దేవతలకు ప్రజలు పూజలు చేశారు. బొడ్రాయిని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో పులిశేరి నరేందర్, గాదె మధుసూదన్, మంద శ్రీను, మాదాసి రాజు, కత్తెరశాల వేణు, శ్రీధర్, అయూబ్, మీసాల ప్రకాశ్, వద్దిరాజు వెంకన్న, సోమలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

24న ఎంఎస్ఎఫ్ రాష్ట్ర సదస్సు

కేయూ క్యాంపస్: ఈనెల 24న కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి మాదిగ తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కేయూలో సోమవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయకుండా మాదిగలను మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు బొడ్డు దయాకర్, భిక్షపతి, సతీష్, రాగల్ల ఉపేందర్, తిరుపతి, మంద భాస్కర్, వడ్డేపల్లి మధు, ముక్కెర ముకేశ్, కుమ్మరి శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

సస్పెండ్ చేయాలి

కాశోజీ సెంటర్: వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ స్టాఫ్ నర్సు రిక్రూట్‌మెంట్‌లో మెరిట్ ఉన్న వ్యక్తుల వద్ద లంచాలు తీసుకోవడంతో పాటు, పల్లె వెలుగు పోస్టింగ్ కోసం డాక్టర్ల నుంచి డబ్బులు తీసుకోవడం, కంటి వెలుగు ప్రోగ్రాంలో ప్రతీ యూనిట్‌కు ఒక వాహనాన్ని ఏర్పాటు చేసే దానిలో పూర్తి స్థాయిలో వాహనాలు కేటాయించకపోవడం వంటి పలు వాటిల్లో అవినీతికి పాల్పడడం జరిగిందని ఆరోపిస్తూ ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి నాయకుడు తడుగుల విజయ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాడ రంజిత్, టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడపాక రాజేందర్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో కోటగుళ్లు



కటాక్షపూర్‌లో శిథిలావస్థకు చేరుకున్న కోటగుళ్లు

- ప్రతిపాదనలకే పరిమితమైన పునరుద్ధరణ పనులు
- శివరాత్రి సమయంలో అధికారుల హడావుడి
- ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని భక్తుల విజ్ఞప్తి

ఆత్మకూరు : ఏళ్ల క్రితం కాకతీయ రాజులు కళాత్మకంగా నిర్మించిన ఆధ్యాత్మిక క్షేత్రం కోటగుళ్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. పట్టించుకునే వారు లేక ఆలయాలు వెలవెలబోతున్నాయి. మండలంలోని కటాక్షపూర్‌లో 163 జాతీయ రహదారికి సమీపంలో కాకతీయ రాజులు రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని అద్భుత శిల్పకళతో కమనీయమైన కట్టడాలతో నిర్మించారు. నగరంలోని వేయి స్తంభాల ఆలయానికి దీటుగా నిర్మించిన ఈ ఆలయాలు ప్రస్తుతం కూలిపోయే స్థాయికి చేరుకున్నాయి. పర్యాటకశాఖ అధికారులు ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఆదరణకు నోచుకోలేదు. భక్తులు ప్రతీ ఏటా శివరాత్రి ఉత్సవాలను ఇదే శిథిలమైన ఆలయంలో నిర్వహించుకుంటున్నారు. మహిమాన్వితమైన ఈ ఆలయాలను సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని పునరుద్ధరించాలని భక్తులు కోరుతున్నారు. ఈ ఆలయాలను అభివృద్ధి చేస్తే జాతీయ రహదారికి సమీపంలో ఉండడం వలన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా విలసిల్లే అవకాశం మెండుగా ఉందని పలువురు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. కోటగుళ్ల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



గర్భగుడిలో రామలింగేశ్వరస్వామి

ఎట్టకేలకు మండల పరిషత్‌కు మోక్షం..



ఐనవోలు : పెయింటింగ్ పూర్తయిన మండల పరిషత్ కార్యాలయం

ఐనవోలు : మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు చేయాలనే ఎనిమిదేళ్ల ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు త్వరలోనే తెరపడనుంది. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హనుమకొండలోని వడ్డేపల్లిలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయాన్ని ఐనవోలు మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. స్పందించిన కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో మండల కేంద్రంలో మండల పరిషత్ ఏర్పాటుకు రూట్ క్లియర్ అయినట్లు తెలిసింది. అయితే మండల కేంద్రంలో మండల పరిషత్ పూర్తిస్థాయి ఆపరేషన్స్ జరిపేందుకు పలు సమస్యలున్నట్లు తెలుస్తోంది. హాస్టల్ భవనంపై ఉన్న వాటర్‌ట్యాంక్‌కు లీకేజీ ఏర్పడటంతో పైకప్పుతో పాటు గోడలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తెలిసింది. వర్షం కురిసినప్పుడు భవనంలోకి నీరు వస్తుందని, కార్యాలయ దస్త్రాలు తడిచే ప్రమాదం ఉందని, కంప్యూటర్ల ఏర్పాటుకు కూడా అడ్డంకిగా మారుతున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం సుమారు రూ.5లక్షల నిధులు అవసరం కానున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎం.సంగీత



వినీల్‌కుమార్

కమలాపూర్ : ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీల్లో కమలాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత సోమవారం తెలిపారు. అండర్–17 విభాగం వాలీబాల్ పోటీల్లో సీఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం.సంగీత, అండర్–17 విభాగం రెజ్లింగ్ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి వినీల్‌కుమార్ ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. అండర్–17 విభాగం వాలీబాల్‌లో ఎంపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని నాగమణి ఉమ్మడి జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ రాజు అభినందించారు.

రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపిక



ఐనవోలు : విద్యార్థులను అభినందిస్తున్న ఏఏపీసీ చైర్మన్, ఉపాధ్యాయులు

ఐనవోలు : మండలంలోని సింగారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి థియేటర్ మైమ్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ ఆనందం తెలిపారు. సోమవారం సింగారం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనన్నట్లు తెలిపారు. గైడ్ ఉపాధ్యాయురాలు మమతతో పాటు విద్యార్థులు ఎండీ రహమాన్, రాంచరణ్, విశాల్, రిత్విక్, శశాంక్‌ను ఏఏపీసీ చైర్మన్ ఖాత వెంకటమ్మ, హెచ్ఎంలు రవీంద్రశర్మ, విజయ్ భాస్కర్ రెడ్డి ఉపాధ్యాయులు ఫాతిమామేరి, మధుసూదన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రశాంత్, సంజీవరావు, రామచంద్రమూర్తి అభినందించారు.

కొనసాగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు



ఆత్మకూరు : సభ్యత్వం అందజేస్తున్న బీజేపీ నాయకులు



దామెర : యాప్ ద్వారా సభ్యత్వ నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూరు : మండలంలో చేపట్టిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుంది. పెంచికలపేటలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మండల సభ్యత్వ ప్రముఖ్ శ్రీకాంత్ రెడ్డి పలువురికి సభ్యత్వాలు అందించారు. హిందూ ధర్మ పరిరక్షణకు కంకణం కట్టుకున్న బీజేపీకి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సదానందం, రాజు, వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

దామెర : సభ్యత్వ నమోదులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కోగిల్వాయిలో జరుగుతున్న సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ వివిధ పార్టీల నుంచి బీజేపీ చేరుతున్నారన్నారు. మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు మహేందర్, శ్రీలత, స్పందన తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖి



విద్యారణ్యపురి: సఖి సెంటర్ ద్వారా అందిస్తున్న ఐదు రకాల సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి కోరారు. కేయూ క్రాస్‌రోడ్డులోని మేధా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్, లెక్చరర్ల సమక్షంలో విద్యార్థినులకు సఖి సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ బాధిత మహిళలు ఉచిత కౌన్సెలింగ్, న్యాయ, వైద్యం, పోలీసు సాయంతోపాటు ఉచిత వసతి కల్పించనున్నట్లు వివరించారు. కేసు వర్కర్ హరిత మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గృహహింస, వరకట్న వేధింపులు పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు, అఘాత్యాలకు గురయ్యే బాధిత మహిళలు, 181, 1098, 100 నంబర్లలో సంప్రదిస్తే తక్షణ రక్షణ కల్పించనున్నట్లు వివరించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



బస్టాండ్ కూడలిలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

పరకాల : పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్ నుంచి బస్టాండ్‌వరకు ర్యాలీ చేపట్టిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు.. కొద్ది సేపు పరకాల బస్టాండ్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. దింతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్ మాట్లాడుతూ.. 2019 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న 8వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌ను విడుదల చేసి నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ప్రశాంత్, పట్టణ అధ్యక్షుడు ఈశ్వర్, పట్టణ కార్యదర్శి సాయితేజ, మండల నాయకులు హేమంత్, వినయ్, అరుణ్, శాంతికుమార్ పాల్గొన్నారు.

లీకేజీలకు మరమ్మతులు

- 'సాక్షి' కథనానికి స్పందన



ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై ప్రధాన తాగునీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీలకు మరమ్మతులు చేస్తున్నారు. పైపులైన్ల లీకేజీలను అరికట్టాలనే శీర్షికతో సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, బల్దియా అధికారులు సోమవారం స్పందించారు. పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీలకు మరమ్మతులు చేపట్టారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

దళిత అధ్యాపకులకు సముచిన స్థానం



ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పరకాల : తెలంగాణ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీల చరిత్రలో మొదటి సారి దళిత అధ్యాపకులకు వైస్ చాన్స్‌లర్ పదవులు కట్టబెట్టి సముచిత స్థానం కల్పించడం హర్షించదగిన విషయమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం పరకాల అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు బస్టాండ్ కూడలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. చంద్రమౌళి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే దళితులకు న్యాయం జరుగుతోందన్నారు. ఎంతో కాలంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేద దళితులు త్వరలో శుభవార్తా వింటారని ఆశాభావ వ్యక్తం చేశారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు సూర్యం, సురేష్, వరుణ్, సంపత్, సుధాకర్, చెంగల్‌రావు, దేవరాజ్, రామకృష్ణ, రవికుమార్, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయం



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, పోలీస్ సిబ్బంది

ఐనవోలు : పోలీసు అమరుల త్యాగాలు చిరస్మరణీయమని పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై కొవ్వొత్తుల ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్‌లను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి త్యాగాలకు గుర్తుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్స్, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సదస్సును జయప్రదం చేయాలి

శాయంపేట : ఈనెల 28వ తేదీన వరంగల్ పట్టణంలో జరిగే ఉద్యమ కళాకారుల సదస్సుకు కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్తర తెలంగాణ ఉత్తమ కళాకారుల విభాగం కో ఆర్డినేటర్ వైద్యుల రజిత సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో కళాకారులు ఎంతో శ్రమించారని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన అనంతరం కళాకారులని పట్టించుకోలేదని, ఎలాంటి న్యాయం జరుగలేదని వాపోయారు. మాజీ సీఎం కేసీఆర్ కళాకారుల ఉద్యమాలతో గద్దెనెక్కి 10 ఏళ్ల పరిపాలన చేసి కళాకారులని గుర్తించలేదన్నారు. కళాకారుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. తెలంగాణ సాంస్కృతిక ఉద్యమ కళాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రాష్ట్రంలో ఉన్న అన్నిరంగాల్లో కళాకారులకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా షరతులు లేకుండా పది లక్షల రుణాలు మంజూరు చేయాలని, వృత్తి సంచార సాంప్రదాయ కళాకారులకి ఉపాధి కల్పన, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నిరుపేద కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ సదస్సుకు తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం కన్వీనర్ పోశెట్టి, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

హన్మకొండ అర్బన్ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని నాలుగో డివిజన్ పెద్దమ్మ గడ్డ జ్యోతిబసు నగర్ ఫేస్–1, 2, రెండవ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ కాలనీలోని పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నార్త్ ఏరియా కార్యదర్శి రమేష్ నాయకులు మల్లేశం, రాజు, కుమారస్వామి, భాస్కర్, రాజ్, రవి పాల్గొన్నారు.

25న చలో హైదరాబాద్

హన్మకొండ చౌరస్తా: కనీస వేతన చట్టం అమలు చేయాలని, శాశ్వత ప్రాతిపదికన డిమాండ్ల సాధనకు ఈనెల 25వ తేదీన మున్సిపల్ కార్మికుల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య తెలిపారు.

మత్స్య కార్మికులకు అండగా ప్రభుత్వం



ముల్కనూరులో చేపపిల్లలను పంపిణీ చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

ఎల్కతుర్తి : మత్స్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ప్రభుత్వం ఉచితంగా అందించిన చేపపిల్లలను సోమవారం ముదిరాజ్ సంఘం నాయకులు వివిధ గ్రామాల్లోని చెరువుల్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకుడు దొంతరవేణి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార్మిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. చేపల పెంపకంతో మత్స్య కార్మికులు ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్లనర్సింగాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు రాంబాబు, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేపట్టిన రెవెన్యూ అధికారులు



సర్వే నిర్వహిస్తున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, అధికారులు

దామెర : మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో అసైన్డ్ భూమి విషయంలో గ్రామానికి చెందిన బండారి సుజాత ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, ఎస్సారెస్పీ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. అనంతరం రైతుల వాంగ్మూలాలతో పాటు పంచనామా నిర్వహించారు. తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి మాట్లాడుతూ.. సర్వే పూర్తి చేశామని, రిపోర్టులను ఉన్నతాధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. వారి వెంట ఆర్ఐలు సంపత్, భాస్కర్‌రెడ్డి, సర్వేయర్ స్టాలిన్ ఉన్నారు.

గోల్డ్ మెడలిస్ట్‌కు అభినందన

హసన్‌పర్తి: ఈనెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ విభాగంలో బంగారు పతకం సాధించిన హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.ఇషాక్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, పీడీ పార్థసారథి, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పెద్దమ్మ నర్సింహారాములు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్

ఖిలా వరంగల్: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణగౌడ్ హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల ఇష్టారాజ్యం అనే శీర్షికతో సాక్షి దినపత్రిలో సోమవారం ప్రచురితమైన కథనానికి వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ స్పందించారు. వరంగల్ ఫోర్ట్ జంక్షన్, అండర్ బ్రిడ్జి, జీపుల అడ్డా, స్టేషన్ రోడ్డు, పోచమ్మమైదాన్, వరంగల్ చౌరస్తా, ఎంజీఎం జంక్షన్, కాశిబుగ్గ, వెంకట్రామ జంక్షన్లలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరించకూడదని, ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలపరాదని, ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని సూచించారు.

సెల్‌ఫోన్, టీవీకి దూరంగా ఉండాలి

హసన్‌పర్తి: విద్యార్థులు సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి కేంద్రీకరించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. హసన్‌పర్తిలోని పాఠశాలలో విద్యార్థులకు సోమవారం డైరీలు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కిరణ్, గడ్డ శివరాంప్రసాద్, దేవస్థాన ధర్మకర్త ఆరెల్లి వెంకటస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకన్న, మాజీ సర్పంచ్ మదన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ఇటీవల అనారోగ్యానికి గురైన హసన్‌పర్తి మాజీ సర్పంచ్ పుల్లా రవీందర్‌ను ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.